# రాకాసి కుక్క......

రచన :
"సుజనశ్రీ"

ఎత్తైన వేదిక మీద గడ్డిబొమ్మ ప్రేలాడుతోంది దిష్టిబొమ్మలా. చేరువలో టేప్‌రికార్డర్‌లో టేప్ నెమ్మదిగా తిరుగుతోంది.

'ప్రియ సోదర సోదరీమణులారా! నేను మరీ వక్కాణించి చెప్పేదేమంటే, సంఘంలో శాంతి భద్రతల్ని భగ్నం చేసేందుకు 'అరాచక' శక్తులు పొంచి ఉన్నయ్, కాబట్టి మనం ఎల్లప్పుడూ జాగరూకులమై మెలగాలి' ఎవరో దేశ నాయకుడి ఉపన్యాసం టేప్ లోంచి వస్తోంది.

'అరాచక' శబ్దం వినరాగానే, వేదికకు పదిగజాల దూరం, సింహంలాంటి అల్సేషియన్ కుక్క ముంగాళ్ళ మీద లేచి కూర్చుంది. 'ఎల్లప్పుడూ' అనే మాట విన వచ్చేసరికి, అతి వేగంగా ముందుకు ఉరికింది వేదిక మీద ప్రేలాడ గట్టిన గడ్డిబొమ్మ కంఠాన్ని కసితీరా కొరికేసి, మళ్ళీ వెనక్కి వచ్చింది.

దాని నోట్లో గడ్డిబొమ్మను చీల్చగా వచ్చిన గడ్డిపరకలు ఒకటి రెండు ప్రేలాడుతున్నాయి.

వెనుదిరిగి వచ్చిన కుక్కను ఆప్యాయంగా నిమిరాడు రాజశేఖరం. మాంసం ముక్కను దానినోటికి అందించాడు.

అల్సేషియన్ ఆత్రంగా మాంసం ముక్కను తినేసింది.

మళ్ళీ టేపులో అవే వాక్యాలు రావడం అల్సేషియన్ తిరిగి గడ్డిబొమ్మ పీకను కొరకటం, జరుగుతోంది.

అల్సేషియన్ ఎంతో నేర్పుగా తను చెప్పినట్టుగ ప్రవర్తించటం రాజశేఖరానికి సంతోషాన్ని కలుగ జేసింది.

అయితే అతడి ఆనందంలో తను చేస్తున్నపనిని మరో ఇద్దరు వ్యక్తులు దూరాన్నుంచి గమనించటాన్ని గమనించలేదు రాజశేఖరం.

రాజశేఖరం బంగళాకు అతి దూరంగా పెద్దచెట్టు కొమ్మల్లో ఆకుల మాటున దాక్కుని చూస్తున్నారు ఇద్దరు ఆగంతకులు. ఇద్దరి చేతుల్లోనూ బైనాక్యులర్స్ ఉన్నాయి. పాకెట్ సైజు ట్రాన్సిస్టర్ ఉంది.

'ఆ గడ్డిబొమ్మను 'బగ్' చేయటం వలన దూరాన్నుంచి, అక్కడి సంభాషణ మనకు స్పష్టంగా వినిపిస్తోంది. అర్థమైందిగా రాజశేఖరం ఎత్తుగడ మిస్టర్ చలపతి!' పొడవటి ఆగంతకుడు తన అనుచరుడితో అన్నాడు,

'అర్థమైంది రమేష్! ప్రపంచ చరిత్రలోనే కనీవినీ ఎరగని అద్భుతమైన ప్లాన్! రేపు ఇదే రీతిలో మన మంత్రిగారు సభలో ఉపన్యాసం ఇస్తారు. ఆ రాకాసి కుక్కను వేదిక దగ్గర వదిలేసి, రాజశేఖరం భద్రంగా జారుకుంటాడు. మంత్రిగారు తన ఉపన్యాసంలో తప్పనిసరిగా చెప్పే వాక్యాల్లోని ఆ రెండు మాటల్ని 'అరాచక' 'ఎల్లప్పుడూ' పదాల్ని కుక్క మనసుకు నాటుకునేలా రాజశేఖరం మంచి శిక్షణ ఇచ్చాడు.

'పొంచి ఉన్న ప్రమాదాన్ని గమనించని మంత్రిగారు తన ప్రసంగాన్ని చెబుతుంటారు. 'అరాచక' అనేపదం పలుకడంగానే కుక్క ముంగాళ్ళమీద లేచి సిద్ధపడుతుంది. 'ఎల్లప్పుడూ' అనే మాట వినబడడంతో కుక్క అతివేగంగా వేదిక మీదకు లంఘించి ఉపన్యాసకుని పీక కొరికి వేస్తుంది.' చలపతి నెమ్మదిగా చెప్పాడు తనకు అర్థమైన దాన్ని.

'కరెక్ట్! చూసేవాళ్ళకూ, సభలోని జనానికీ ఇదేదో హఠాత్సంఘటన, దుర్ఘటన అనుకుంటారేగానీ, పకడ్బందీగా ప్లాను వేసి చేయించిన హత్య అని ఎవరూ ఊహించలేరు. ఈ దారుణం జరగకుండా ఆపవలసిన బాధ్యత మన మీదుంది. ఇక తర్వాత జరగవలసిన పని గురించి ఆలోచించాలి. పోదామా ఇక!' రమేష్ చెట్టుకొమ్మ మీద దిగజారుతూ అన్నాడు.

చలపతి అతడ్ని అనుసరించాడు. కొంత దూరం నడిచి, ఇద్దరూ అంబాసిడర్ కారులో ఎక్కారు.

◆ ◆ ◆

'గుడ్ మార్నింగ్ డాక్టర్!' అన్నాడు రమేష్.

'పామరీల్' కుక్కపిల్లకు ఇంజెక్షన్ ఇస్తున్న డాక్టరు ఆగంతకుల వంక చూశాడు అనుమానంగా.

'మీరు కుక్కల స్పెషలిస్ట్ అని మాకు తెలిసే వచ్చాం. గూఢచారి శాఖకు చెందిన వాళ్ళం. కుక్కల మనస్తత్వాన్ని, దాని సైకాలజీలో మీరు ప్రవీణులని విన్నాం మీనుంచి మాకో సహాయం కావాలి.'

'అప్పుకోర్స్! మీరు విన్నది వాస్తవమే! నా నుంచి మీకు కావలసిన పనేమిటి?' డాక్టర్ ఆసక్తిగా అడిగాడు.

'మా పోలీసు డిపార్టుమెంటులో మేలురకం జాతి కుక్కలను దొంగలూ, హంతకుల ఆచూకీ తీసేందుకు ఉపయోగిస్తూనే ఉన్నాం. కానీ ఒక కుక్క హంతకిగా మారేందుకు తగిన శిక్షణ పొందుతోంది ఒక రహస్య స్థావరంలో, దాని వలన హత్య జరగకుండా అడ్డుకోవటం మా విధి!'

'మైగాడ్! నా సర్వీసులో ఇలాంటి కేసే వినలేదు. ఇంతకీ ఆ కుక్క ఎవర్ని హత్య చేయబోతోంది?'

'మన ముఖ్య మంత్రిగార్ని! వచ్చేవారం ఈ నియోజక వర్గంలో రానున్న బైఎలక్షన్ ప్రచారం కోసం ముఖ్య మంత్రిగారి సభ జరగబోతోంది.'

'చాలా ఘోరం! ఎవరా నిగూఢ పన్నాగం పన్నే దుర్మార్గుడు!' డాగ్ స్పెషలిస్ట్ డాక్టర్ విశ్వనాథం అదిరి పడ్డాడు.

'రాజశేఖరం పెద్ద పెట్టుబడి దారుడు. అతడి బస్సు రూట్లను ముందుగా జాతీయం చేశాడని అతగాడి కసి!' రమేష్ నిదానంగా చెప్పాడు.

'ఆ కుక్క మరీ పెద్దదా?'

'రాకాసిలా ఉంటుంది. దాని బరువు తొంభై పౌన్లు! తెలుసా!'

'అయితే అది భయంకరమైనదే అయి ఉంటుంది. వాడ్ని వాడి కుక్కనూ ఉన్న పళాన అరెస్ట్ చేయకూడదూ?' ఆవేశంగా అన్నాడు డాక్టర్ విశ్వనాథం.

'అందుకు తగిన ఆధారాలు లేవు, వాస్తవానికి అతడు ఇంతవరకూ చట్టాన్ని అతిక్రమించలేదు కదా? అంతే గాక అతడి పథకాన్ని మేం కనిపెట్టామని తెలిస్తే ఈ ప్రయత్నాన్ని విరమించ వచ్చు. ఇంతకన్నా ప్రమాద భరితమైనదీ, నిగూఢమైన పథకాన్ని వేసుకోవచ్చు.'

(సశేషం)

## — తెలుగుబాల —

ఆ॥ తల్లి, దండ్రిచుట్టు తిరుగాడి గణపతి
ప్రథమ పూజ పదవి పొందలేద!
తల్లి దండ్రి కంటె దైవముం కెవ్వరు!
తెలిసి మసలుకొమ్ము తెలుగుబాల.

ఆ॥ ఎరువు సొమ్ములిలను బరువు చేటుయె గాక
పెట్టుకొనుచు తీయ బాధ చేటు
అందు నేది పోవ నప్పుల చేటురా!
తెలిసి మసలుకొమ్ము తెలుగుబాల.

ఆ॥ ఒక్క తీగపూలు నొక్కరీతిగ నుండు
చూడ చెట్టు ఫలముఁ గూడ నొకటె
ఒక్క తల్లి వారు పెక్కుతీరులు యేమొ!
తెలిసి మసలుకొమ్ము తెలుగుబాల.

ఆ॥ ఆముదంపు మొక్క యమరు వృక్షమ్ముగా
చెట్టు చేమ లేని నట్టిచోట్ల
విద్య లేని దరిని విజ్ఞాని మూర్ఖుడె!
తెలిసి మసలుకొమ్ము తెలుగుబాల.

ఆ॥ ముల్లుతోటి కాలి-ముల్లు తీయగ వచ్చు
రవ్వకోయ బడును-రవ్వతోన
దొంగయె సరిపోవు-దొంగవానిని బట్ట
తెలిసి మసలుకొమ్ము తెలుగుబాల.

ఆ॥ కాలమంత చక్కకలసి వచ్చిననాడు
పట్టుకున్న మట్టి పసిడి యగును
కాల మహిమగాకఁ గాదుతన్మహిమేమి!
తెలిసి మసలుకొమ్ము తెలుగుబాల.

- రాయప్రోలు వామనమూర్తి.

★